క్లుప్తంగా

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



పెద్దకొత్తపల్లి: పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు సీఎంఆర్‌ఎఫ్ సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కల్వకోల్‌కి చెందిన జైపాల్ అనారోగ్యంతో ఉండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష ఎల్‌ఓసీని అందజేశారు. శ్రీనివాసులు, కొండ శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

ఉప్పునుంతల: మన్ననూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని నిఖిత మృతిని నిరసిస్తూ.. శనివారం రాజకీయ పార్టీలు, కులసంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే చలో హాజీపూర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శుక్రవారం మండలంలోని కొరటికల్‌లో దండోరా నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. విద్యార్థిని నిఖితను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన హంతకులను అరెస్టు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో శ్రీశైలం –హైదరాబాద్ రహదారిలోని హాజీపూర్ చౌరస్తా వద్ద రహదారి దిగ్బంధం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. దండోరా నాయకులు శ్రీశైలం, జంగయ్య, అలివేల, అనిల్, అశోక్, హుసేన్ పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా కళ్యాణ్



నాగర్‌కర్నూల్ రూరల్: బీఎస్పీ మండల అధ్యక్షుడిగా కళ్యాణ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎస్పీని మరింత బలోపేతం చేసేందుకు నిర్విరామంగా కృషి చేయాలని జిల్లా నాయకులు సూచించారు. మండల అధ్యక్షుడిగా పనిచేసిన నాగేశ్‌ను అసెంబ్లీ కమిటీలోకి తీసుకోనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు పృథ్వీరాజ్ మహేశ్, ఆనంద్ తెలియజేశారు. పార్టీ నాయకులు రాంచందర్, వెంకటయ్య, మహేశ్, పర్వతాలు, బాలరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 18వ వార్డులో ఓ అనాథ వృద్ధ మహిళ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ జి.శివ మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. మృతి చెందిన దుర్గమ్మ ఇంటికి మున్సిపల్ సిబ్బంది వచ్చి ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలించారు. అక్కడే అంత్యక్రియలు పూర్తి చేశారు.

కోడేరులో స్వచ్ఛ భారత్



కోడేరు: బీజేపీ ఆవిర్భావం సందర్భంగా మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రిలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వరల్డ్ హెల్త్‌డే సందర్భంగా డాక్టర్ దశరథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహేశ్, బాలపీరు, రామకృష్ణ, భాను పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన కృష్ణయ్యకు రూ.18,000, శేషమ్మకు రూ.52,000 ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ కర్రెమ్మ చెక్కులను పంపిణీ చేశారు.

కరపత్రాలు విడుదల

ఉప్పునుంతల: అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ జయంతి ఉత్సవ కరపత్రాలను సంఘం నాయకులు విడుదల చేశారు. ఉత్సవాలకు గ్రామాల నుంచి భారీగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శ్రీశైలం, ఆనంద్, విజయ్, ప్రభాకర్, రామచంద్రయ్య, కురుమయ్య, లక్ష్మయ్య, గణేష్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ నుంచి కురుమిద్దెకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం తర్నికల్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేశ్ గౌడ్ జేసీబీతో గుంతలను పూడ్చివేశారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు సొంతంగానే కార్యక్రమం చేసినట్లు చెప్పారు. ఆయన్ను రైతులు జంగయ్య, తిరుపతయ్య అభినందించారు.

రోడ్డు నిర్మాణం ఇంకెన్నాళ్లు..



వాహనాల వెనుక వస్తున్న దుమ్ము

తాడూరు: మండల కేంద్రం నుంచి ఎండబెట్ల మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు నిర్మాణం పనులు నెల రోజుల కిందట చేపట్టారు. ప్రారంభంలో ఆగమేఘాలపై పనులు చేపట్టడంతో త్వరితగతిన పనులు పూర్తవుతాయని, దారి వెంట తిరిగే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. పనులు నిర్వహించిన వారం రోజులకే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు కంకర శాతాన్ని పరిశీలించారు. ఇక బీటీ నిర్మాణ పనులు చేపడుతారని అనుకున్న ప్రయాణికులకు నిరాశ ఎదురైంది. కంకర పరిచి 20 రోజులు కావొస్తున్నా.. పనుల్లో చలనం కనిపించడంలేదు. ఏకంగా పనులను నిలిపివేశారు. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో దుమ్ము ఎక్కువగా వస్తుంది. కంకర పరిచిన అనంతరం నీటి సరఫరా చేయకపోవడంతో చిన్న వాహనాలు వెళ్లినా.. దుమ్ము రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పరిశీలించి, నిలిచిన పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

కార్యకర్తలే నా బలం, బలగం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: కార్యకర్తలే నా బలం, కుటుంబం, ధైర్యం, బలగమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రజల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. మరోసారి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టిస్తామని, హైట్రిక్ సాధించడమే లక్ష్యమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, ఎంపీపీ శాంతాభాయి, జెడ్పీటీసీ మంత్రియానాయక్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, పర్వతాలు, సతీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మేళనం విజయవంతం చేయండి

వెల్దండ: మండల కేంద్రంలోని తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో ఈ నెల 9న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి సలహాలు, సూచనలు వివరిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ రాములు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సింగల్‌విండో చైర్మన్, డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



అచ్చంపేటలో నాటక ప్రదర్శనలో చిన్నారులు

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక ఎంబీ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు లోకరక్షణ నిమిత్తం సిలువ వేయబడి మృతిచెందిన రోజును గుర్తు చేసుకుంటూ.. ఈ గుడ్ ఫ్రైడే కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకొంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చి సంఘానికి చెందిన క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంబీ చర్చి చైర్మన్ కెఎస్ జోసెఫ్, వైస్ చైర్మన్ బీఎస్ సంపత్‌కుమార్, కార్యదర్శి పి సంపత్‌కుమార్, రాజారత్నం, భాస్కర్ మత పెద్దలు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎంబీ షాలేం చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ పరంజ్యోతి మాట్లాడారు. చిన్నారుల నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో జేమ్స్, కర్ణాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దోమలపెంట(అచ్చంపేట): గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు కుటుంబ సమేతంగా చర్చిలో ఉపవాస ప్రార్థనలు చేశారు. స్థానిక చర్చిలో డా.రెవె. ఆశీర్వాదం గుడ్‌ఫ్రైడే సందేశాన్ని తెలియజేశారు. సమస్త మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం యేసుక్రీస్తు సిలువపై తన ప్రాణాన్ని అర్పించి త్యాగం చేశారని తెలిపారు. సిలువపై యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను తెలిపారు.



దోమలపెంటలో ప్రార్థనలు



నాగర్‌కర్నూల్‌లో..

ప్రశ్నపత్రాల లీక్‌లో బీజేపీ కుట్ర



మాట్లాడుతున్న శివవర్మ

కొల్లాపూర్: ప్రశ్నపత్రాల లీక్‌లో బీజేపీ కుట్రలు ఉన్నాయని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ అన్నారు. శుక్రవారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 11న హైదరాబాద్‌లో మహాదీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ నేతలు కుట్రలు పన్నారన్నారు. అధికారం కోసం బీజేపీ ఎటువంటి కుటిల ప్రయత్నాలైనా చేస్తుందన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, నాయకులు రామకృష్ణ, చంటి తదితరులున్నారు.

ప్రతి కార్మికుడికి వేతనం చెల్లించాలి



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10,898 వేతనాన్ని అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కుమ్మెర గ్రామపంచాయతీ పరిధిలోని కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి పంచాయతీ పాలకవర్గం ప్రభుత్వం ప్రకటించిన వేతనానికి బదులు రూ.4 వేల చొప్పున కార్మికులకు అందజేసి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీఓ నంబర్ 51 రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు దేవమ్మ, రామేశ్వరమ్మ, వెంకటమ్మ, లక్ష్మమ్మ, నర్సింహ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రాథోడ్

లింగాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం మండల యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. తన తండ్రి దారారానికి చెందిన రాత్లావత్ రాములునాయక్ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ తెలియజేశారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడు నెలల పాటు చలివేంద్రం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు బుడ్డయ్య, మల్లయ్య, దిలీప్, భాస్కర్, దస్తగిరి, అశోక్, ఇందిరమ్మ, హమాలీ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



గిరిజనులతో మాట్లాడుతున్న అశోక్ నాయక్

కొల్లాపూర్ రూరల్: ఫారెస్టు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ముక్కిడిగుండంలో పోడుభూములు సాగు చేసుకుంటున్న గిరిజనులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పి, సంవత్సరాలు గడుస్తున్నా.. నేటి వరకు పట్టాలివ్వడం లేదన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమిపూజ

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం శుక్రవారం సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంపీ రాములు భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జంగమ్మ, అంతయ్య, పర్వతాలు, వెంకట్రావు, మల్లేష్‌ముదిరాజ్, శ్రీనివాసులు ఉన్నారు.

గురుకుల ఖాళీల భర్తీపై హర్షం

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు గురుకులాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిందని తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేశ్ అన్నారు. గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ 9,231 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయడాన్ని హర్షించారు. గురుకులాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని పాలమూరు చౌరస్తా అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు గురుమూర్తి శుక్రవారం పాలాభిషేకం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అంబేడ్కర్ జయంతి రోజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగాల భర్తీ కోసం దీక్ష చేపడుతామని, నిరుద్యోగ జేఏసీ నాయకురాలు యామిని చెప్పారు. ప్రభుత్వం ఖాళీలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

బల్మూర్: అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని తుమ్మెన్‌పేటలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పార్టీ కార్యకర్త ఎండీ జకిరియా కుటుంబాన్ని శుక్రవారం వంశీకృష్ణతో పాటు పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. దీంతో పాటు మృతుని భార్య పిల్లలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్‌గౌడ్, యాదగిరి, నిరంజన్, రాజురావు, అనిల్‌గౌడ్, సురేష్, తదితరులు ఉన్నారు.

జ్ఞానేశ్వర్‌ను కలిసిన నాయకులు

కల్వకుర్తి రూరల్: తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌ను శుక్రవారం కల్వకుర్తి టీడీపీ నాయకులు కలిశారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన పార్టీ కార్యక్రమాలను వివరించడంతో పాటు ఇంటింటికి టీడీపీ అనే కార్యక్రమంపై వివరించారు. ఈ సందర్భంగా యాదిలాల్ విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు తిమ్మయ్య, వజ్రలింగం, సత్యం, పద్మనాభం పాల్గొన్నారు.

అప్పాయపల్లిలో సీసీ రోడ్ల పనులు



లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లిలో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణం పనులను సర్పంచ్ నీలవేణి, ఎంపీటీసీ కాశీనాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో సీసీరోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో 10 వార్డుల్లో అవసరమైన ప్రదేశాల్లో రోడ్లను వేయిస్తున్నట్లు తెలియజేశారు. మాజీ ఉపసర్పంచ్ పర్వతాలు, నరేశ్, రాజేందర్, మల్లేష్, లక్ష్మి, శివలీల, ఆవుల మల్లయ్య పాల్గొన్నారు.

కాలి బూడిదైన హరితహారం మొక్కలు



తాడూరు: మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరుపక్కల నాటిన మొక్కలు నిర్వహణ లేక అగ్నికి ఆహుతయ్యాయి. రోడ్డు పక్కన ఎండిపోయిన గడ్డికి నిప్పు పెట్టడంతో హరితహారంలో నాటిన మొక్కలు సైతం కాలిపోయాయి. ప్రతి రోజు నర్సరీలను, నాటిన మొక్కలను పరిశీలిస్తున్నామని చెప్పడం వరకే సరిపోయింది, కాలి బూడిదైన మొక్కల విషయాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా మైసమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం



గోవిందాయిపల్లి పూజలో పాల్గొన్న భక్తులు

బల్మూర్: మండలంలోని జినుకుంట కనకాల మైసమ్మ అమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అమల దంపతులు ఆలయంలో వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ విష్ణుమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చిన్నారెడ్డి, రాజు అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లి కట్టపై వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆవరణలో శుక్రవారం రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా నిర్వహించే ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాఘవేందర్‌రావు తెలియజేశారు. యజ్ఞాలు, పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం రథోత్సవం నిర్వహించి పాల్గొన్న భక్తులకు సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం బండ్లు తిరుగుట, స్వామివారికి అభిషేకం, చక్రస్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

మరుగుదొడ్ల కూల్చివేతపై నిరసన



కార్యక్రమంలో బీజేపీ నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల కూల్చివేతపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడారు. మున్సిపల్ నిధులు రూ.12 లక్షల వ్యయంతో ఏడాది కిందట సామూహిక మరుగుదొడ్లు నిర్మించారన్నారు. వీటిని ప్రారంభించకుండానే రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణ ఉంటుందని తెలిసి కూడా మరుగుదొడ్లు రోడ్డుపై ఎందుకు నిర్మించారో మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన మున్సిపల్ కమిషనర్, ఏఈలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగౌడ్, ఎల్లయ్యయాదవ్, చంద్రశేఖర్‌రావు, కాశీపురం మహేష్, రెడ్డి నర్సింహ్మ తదితరులున్నారు.

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడి



మహీంద్రా మేలు రకం వరి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఉప్పునుంతల: రైతులు వరిలో మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు పంట సాగు, యాజమాన్యం విషయంలో శ్రద్ధ తీసుకుంటే ఆశించిన దిగుబడి వస్తుందని పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు అన్నారు. శుక్రవారం మర్రిపల్లిలో భూపాల్‌రావు 30 ఎకరాల్లో సాగుచేసిన మహీంద్రా ఎమ్‌పీఆర్ 404 రకం వరి పంటపై కంపెనీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది యాసంగిలో రైతులు సాగుచేసిన వరి పంటకు తెగుళ్లు సోకి పూర్తిగా పంట నష్టపోవల్సిన పరిస్థితి ఉన్నా.. భూపాల్‌రావు సాగుచేసిన వరి పంట ఎదుగుదల, పొడవైన కంకులతో ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యధిక దిగుబడి ఇచ్చే మహీంద్రా కంపెనీ మేలురకం వరి విత్తనాలను పీఏసీఎస్‌లో రైతులకు అందుబాటులో ఉంచామని కంపెనీ టీఎస్‌ఎం శ్రీనివాస్‌రావు తెలియజేశారు. సేల్స్ ఆఫీసర్లు బంగారయ్య, రవీందర్‌రెడ్డి, మురళీ, రైతులు పాల్గొన్నారు.

'న్యాయం ఎప్పటికీ గెలుస్తుంది'



ప్రచారం నిర్వహిస్తున్న నిరంజన్ గౌడ్

పెంట్లవెల్లి: రాష్ట్రంలో దొరలపాలన ఎక్కువైపోయిందని, అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం నోరు మూయించడం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అలవాటు అయిపోయిందని బీజేపీ నాయకులు అన్నారు. రెండు రోజుల కిందట తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం ఎంతో అన్యాయమని, అందుకుగాను హన్మకొండ కోర్టులో బండిసంజయ్‌కు బెయిల్ మంజూరు చేయడాన్ని హర్షిస్తూ.. పెంట్లవెల్లిలోని బీజేపీ నాయకులు బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర మాట్లాడారు. ఇకపై రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ ఆటలు సాగవని బీజేపీ నాయకులు భరత్ చంద్ర అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, పెంట్లవెల్లి మండల అధ్యక్షుడు ప్రతాప్, ఖలీల్, వెంకటస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు ఓబీసీ

కల్వకుర్తి రూరల్: బీజేపీ కార్యకర్తలు నాయకులు శుక్రవారం 1వ వార్డులో పల్లెపల్లెకు ఓబీసీ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు ప్రవేశపెట్టిన పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. సంజయ్, సురేందర్‌యాదవ్, చరణ్, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు ప్రశంసనీయం



విధులు ముగించుకుని ఫరహాబాద్ గేట్ వద్ద ఆర్టీసీ సిబ్బంది

మన్ననూర్: సలేశ్వరం ఉత్సవాలకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ సంస్థ వారు ఏర్పాటు చేసిన బస్సు సర్వీసుల సేవలు ప్రశంసనీయమని పలువురు భక్తులు నిర్వహణ అధికారులు, సిబ్బంది కొనియాడారు. గతంలో దారిపొడువున అనేక చోట్ల వాహనాలు రిపేర్లు, నిలిచిపోవడం జరిగి భక్తులు ఇబ్బందులకు గురయ్యేదని అన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది నిర్వహించిన ఉత్సవాలకు అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, వనపర్తి డిపోల నుంచి బస్సులను నడిపించారన్నారు. ఈ క్రమంలో అచ్చంపేట డిపోకు చెందిన డీఎం రాజశేఖర్ మూడు రోజుల పాటూ బస్సుల రాకపోకల పర్యవేక్షణ పరిశీలించడంతో పాటూ సుమారు 25 మంది సిబ్బందిని వివిధ ప్రాంతాల్లో నియమించి భక్తుల రాకపోకలకు ఎలాంటి అవాంతరాలు కలుగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు.